క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



తెనాలి అర్బన్: అన్నదాత సుఖీభవ ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో వెలువోలు సుబ్బారావు, విజయలక్ష్మి దంపతుల సహకారంతో బుధవారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి నెల రోజులు దాటిందని చెప్పారు. ప్రతిరోజూ దాతల సహకారంతో మంచినీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దూబ సందీప్, రాచకొండ మురళీకృష్ణ, కుమార్, కొత్తగొర్ల శ్రీనివాసరావు, దూళ్లిపూడి శ్రీరామ్ మూర్తి, అబ్దుల్ రజాక్, తుల్లిమిల్లి పోతురాజు, జి.వి.నారాయణ, బాలు నాయక్, శిఖనం వరప్రతాప్, మునిపల్లి వెంకట రఘునాథరావు, ఓలేటి వెంకట ప్రతాప్ పాల్గొన్నారు.

విద్య ఆవశ్యకతపై ప్రచారం



తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీఆర్‌బీసీ) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక యడ్ల లింగయ్య కాలనీ, నందులపేట, రూరల్ మండలం కొలకలూరు, కఠెవరం ప్రాంతాల్లో విద్యా చైతన్య ప్రజారోద్యమాన్ని నిర్వహించారు. డీఆర్‌బీసీ కమ్యూనిటీ మొబిలైజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బడి వయసు కలిగిన చిన్నారులు అందరినీ తప్పనిసరిగా బడికి పంపి చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు.కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత సక్రమంగా చేపట్టాలి



తెనాలి అర్బన్: పట్టణంలోని ప్రధాన మురుగు కాల్వలో పారుదల సక్రమంగా జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని రెండు, 39వ వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పాటి డ్రెయిన్‌ను పరిశీలించారు. కాల్వలో ఎక్కడ అడ్డంకులు కనిపించిన వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని సిబ్బందికి చెప్పారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

శాఖా గ్రంథాలయం తనిఖీ



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ బుధవారం తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ అధికారి నాగర్ బాషాను సమ్మర్ క్యాంప్ ఏ విధంగా నిర్వహిస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంగ్లిష్ మ్యాగజైన్లను అందుబాటులో ఉంచాలని, గ్రంథాలయానికి వచ్చే వారి సంఖ్యను పెంచాలని సూచించారు.

31న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు రూరల్: గుంటూరు రూరల్ మండలం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 31న నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్ ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31న శుక్రవారం ఉదయం 11 గంటలకు నగరంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు సమావేశంలో పాల్గొనాలని కోరారు.

శ్రీ చంద్రశేఖరస్వామికి కదళీ ఫలార్చన

తెనాలి: పట్టణ మారీసుపేటలోని శ్రీబాలాత్రిపురసుందరీ సమేత శ్రీచంద్రశేఖరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి కదళీ ఫల అర్చన చేశారు. దేవస్థానంలో ఈనెల 26వ తేదీ నుంచి ఒకటో తేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు, పది లక్షల ప్రదక్షిణాల మహాయజ్ఞం జరుగుతోంది. ఇందులో భాగంగా జరిగిన విశేష పూజల అనంతరం లలితా గోష్ఠి సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.





స్వామికి కదళీ ఫల అర్చన, హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న లలితా గోష్ఠి సభ్యులు

మధ్యాహ్న భోజనం రుచికరంగా సిద్ధం చేయాలి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం అందించే నిర్వాహకులతో విద్యా కమిటీ చైర్మన్లతో బుధవారం ఎంఈఓ ఖాజా లక్ష్మీనారాయణ సమావేశం నిర్వహించారు. దుగ్గిరాల ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 13వ తేదీ నుంచి పాఠశాలలను పునః ప్రారంభం కానున్నాయని, ఆ రోజు నుండి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం ఏర్పాటు చేయాల్సి ఉందని, అందుకు అవసరమైన వంటపాత్రలు, సరుకులను సరిచూసుకుని లేనివాటిని గుర్తించి ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పాఠశాల పునః ప్రారంభం నుంచి విద్యా కమిటీ ఆధ్వర్యంలో ఒకరు బాధ్యత తీసుకుని మధ్యాహ్న భోజన పథకం ఏ విధంగా అమలు అవుతుంది? భోజనానికి ముందు విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే దగ్గర నుంచిఇతర అంశాలను ఉపాధ్యాయులతో పాటు పేరెంట్స్ కమిటీ కూడా విద్యార్థులకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.బ్రహ్మయ్య, ఆర్వీ ముత్తేశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ ఖాజా లక్ష్మీనారాయణ

భవిష్యత్‌కు సర్వే..

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని 18 గ్రామాల్లో దివ్యాంగులను బడిబాట పట్టించే దిశగా చర్యలు ప్రారంభం అయ్యాయి. దానిలో భాగంగా దుగ్గిరాల ఎంఈఓ-2 ఖాజా లక్ష్మీనారాయణ బుధవారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలకు చేరని వారితో పాటు విద్యకు దూరమైన వారి వివరాలను సేకరిస్తున్నారు. చదువుల వల్ల ప్రయోజనాలను, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సంక్షేమం గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నామని, ఇప్పటికే 18 గ్రామాల్లో 53 మంది దివ్యాంగులను గుర్తించి వారిని మండలంలోని దివ్యాంగులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పాఠశాలలకు తీసుకు వెళ్లేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. జూన్ 9వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహిస్తామని, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ద్వారా దివ్యాంగులకు అందజేయవలసిన అన్ని పథకాలను అందించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలి అర్బన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని ఆయన పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

దాతల సహకారం అభినందనీయం

పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఆలయ ఉప కమిషనర్ వీవీఎస్‌కే ప్రసాద్ అన్నారు. పెదకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బోయపాటి వెంకటరమణ బుధవారం శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థాన నిత్యాన్నదాన పథకానికి రూ.27 వేలు విరాళం అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్యాన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన భక్తులకు, దాతలకు విజ్ఞప్తి చేశారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు



అగతవరప్పాడులో కవాతు నిర్వహిస్తున్న సీఐ వీరాస్వామి, సిబ్బంది

పెదకాకాని: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో గొడవలు, అల్లర్లకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని సీఐ కె వీరాస్వామి అన్నారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి, అగతవరప్పాడు గ్రామాల్లో బుధవారం కవాతు నిర్వహించారు. గ్రామంలో ప్రధాన రోడ్ల వెంబడి పోలీసు కవాతు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమయంలోనూ, ఫలితాలు వెలువడిన తరువాత ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే గ్రామంలో వివాదాలకు పాల్పడే పలువురు వ్యక్తులను గుర్తించడం జరిగిందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు శాంతియుతంగా ఉంటూ సహకరించాలన్నారు. ఈ కవాతులో ఎస్‌ఐలు నాగేంద్ర, ఎండీ మిరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి సిద్ధమైన దేవాలయం

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వైఎస్సార్(కొత్తూరు) సెంటర్‌లోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం నుంచి హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బుధవారం దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 7.30 గంటలకు స్వామికి పంచామృత అభిషేకం, 108 కలశ బిందెలతో జలాభిషేకం, అనంతరం అలంకరణ, మంత్రపుష్పం కార్యక్రమాలు, 31వ తేదీ శుక్రవారం ఉదయం మన్యుసూక్త సహిత హనుమత్ హోమం, సాయంత్రం 6 గంటలకు సువర్చల సహిత దాసాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం, జూన్ 1వ తేదీ ఉదయం నుంచి తమలపాకుల పూజ, సింధూరార్చనలు, విశేష అర్చనలు, అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు స్వామివారికి గ్రామోత్సం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



కొత్తూరులోని శ్రీ దాసాంజనేయస్వామి ఆలయం

వేమవరంలో..

ఫిరంగిపురం: హనుమత్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. వేమవరంలోని ఆంజనేయస్వామి ఆలయం, అడ్డరోడ్డు వద్ద అభయాంజనేయస్వామి ఆలయం, 113 తాళ్లూరులోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, వేములూరిపాడులోని తూర్పుముఖ ఆంజనేయ స్వామి, రేపూడిలోని వీరాంజనేయ స్వామి, శిరంగిపాలెంలోని బాలాంజనేయ స్వామి ఆలయాలను శుభ్రం చేసి రంగులు వేశారు. జూన్ 1న ఆలయాల్లోని స్వామివార్లకు విశేష పూజలు, నాగవల్లీ దళార్చనలు నిర్వహించనున్నట్లు ఆలయాల అర్చకులు తెలిపారు. మండ లకేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేసి మధ్యాహ్నం శాంతి కళ్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం గ్రామస్తుల సహకారంతో నిర్వహించనున్నట్లు ఆలయ దేవదాయ శాఖ ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు.

సాంకేతిక విద్యతో ఉద్యోగావకాశాలు

వెంకటేశ్వర స్పిన్ టెక్స్ సంస్థ జీఎం ఏ గిరిధర్

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలను పొందిన విద్యార్థులకు విజయోత్సవ సభను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల టెక్స్‌టైల్స్ విభాగాధిపతి కె మహమ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కావూరులోని శ్రీ వెంకటేశ్వర స్పిన్ టెక్స్ సంస్థ జనరల్ మేనేజర్ ఏ గిరిధర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య ద్వారా విద్య పూర్తయిన అనంతరం త్వరిత గతిన ఉపాధిని పొందవచ్చన్నారు. టెక్నికల్ డిప్లమోలతో ఉన్నత స్థానాలలో ప్రస్తుతం ఉన్న పూర్వ విద్యార్థుల విజయ గాథలను వివరించారు. గుంటూరు టెక్స్‌టైల్స్ డైరెక్టర్ నక్కా నాగేశ్వరరావు మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ పరిశ్రమలలోనే కాకుండా మార్కెటింగ్, కన్సల్టెన్సీ విభాగాలలో కూడా టెక్స్‌టైల్స్ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కాతే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నూరు శాతం ఉపాధిని కల్పించామన్నారు. అందులో 13 మంది విద్యార్థులకు మంచి జీతంతో ఉన్నత సంస్థల్లో ఉపాధి లభించిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగాలను పొందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ ఉప్పలపాటి రాధాకృష్ణ, ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ కే వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి

పెదకాకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు పరచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు, గోళ్ళమూడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను సీపీఎం బృందం సందర్శించింది. ఈ కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండు చేశారు. కనీస రోజువారీ వేతనం రూ.300లు ఇవ్వాలని, మేట్లకు అదనంగా రూ.200లు ఇవ్వాలన్నారు. కూలీలు రెండు పూటలా పని చేయాలనే నిబంధనను విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బురదగుంట సాంబయ్య, రాజా రమేష్, మన్నెం శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పాశం రామారావు

విద్యార్థులకు గ్రామర్, గణిత శాస్త్రంపై అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ఆంగ్ల అధ్యాపకుడు యు.పాలప్రసాద్ ఇంగ్లిష్ వ్యాకరణాన్ని బోధించారు. ఆర్టికల్స్, టెన్స్ గురించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. అనంతరం గ్రంథాలయ పాఠకురాలు గణిత శాస్త్రంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్. వెంకటేశ్వరరావు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ కంచాలతో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన



ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు బుధవారం ఖాళీ కంచాలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ మే 31వ తేదీ నాటికి సిమెంట్ ఫ్యాక్టరీ మూసివేసి 31 సంవత్సరాలు కావస్తున్నదని, ఇప్పటి వరకు కార్మికులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే జూన్ 9వ తేదీ సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లోకి వెళ్లి భూమిని స్వాధీనం చేసుకుని నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికులు సుదీర్ఘ పోరాటం నిర్వహిస్తున్నారని, కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు వెలువరించినా కార్మికులకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఏఐటీయూసీ నాయకులు టి.వెంకటయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ, దర్శనపు సామ్యేలు, సీపీఎం రూరల్, పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, బీఎస్పీ నాయకులు జయరాజు, కార్మికులు యెహోషువా, సూర్యప్రకాష్, నవనీతం, సాంబశివరావు, సుబ్బారావు, ఎస్‌కే ఆసిఫ్, శారద, శౌరమ్మ, అంకయ్య పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే సహించేది లేదు

రూరల్ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు

తెనాలి రూరల్: కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని రూరల్ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు ప్రజల్ని హెచ్చరించారు. రూరల్ పోలీసులు మండలంలోని సోమసుందరపాలెం, నేలపాడు, కంచర్లపాలెం గ్రామాల్లో బుధవారం సాయంత్రం రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే అసాంఘిక శక్తుల్ని సహించేదిలేదని స్పష్టం చేశారు. ఎక్కడా అలజడులు లేకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చిన్న వివాదం రేకెత్తినా ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారమందించాలని ఆయన కోరారు.



రూట్ మార్చ్‌లో ఎస్‌ఐ, సిబ్బంది

‘ఆటా’ సమావేశాలకు సాయి లక్కరాజు



తెనాలి: అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) 18వ ద్వైవార్షిక సమావేశాలకు తెనాలికి చెందిన స్వరలయ వేదిక సంస్థ వ్యవస్థాపకుడు, కవి, రచయిత, నటుడు, దర్శకుడు సాయి లక్కరాజుకు ఆహ్వానం లభించింది. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలోని అట్లాంటాలో జూన్ 7,8,9 తేదీల్లో ఈ సమావేశాలు జరగనున్నాయి. 8వ తేదీన జరిగే ప్రారంభసభలో ప్రముఖ రచయితలు, కవులు నందినీ సిద్ధారెడ్డి, కాసర్ల శ్యామ్, అఫ్సర్ పాల్గొంటారు. రెండో సెషన్‌లో సినిమా రంగానికి చెందిన వంగా సందీప్‌రెడ్డి, ఆదిత్య, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్ హాజరవుతారు. ‘విభిన్న స్వరాల వేదిక’ పేరుతో జరిగే మూడో సెషన్‌లో సాయి లక్కరాజు కీలకోపన్యాసం ఉంటుందని తెలియజేశారు. గతంలో మలేషియా, సింగపూర్, దుబాయ్, కెనడా, స్పెయిన్ దేశాల్లో తెలుగువారు నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న సాయికి తాజాగా ఆటా ఆహ్వానం లభించిన సందర్భంగా బుధవారం సంస్థ కార్యాలయంలో సభ్యులు అభినందించారు. స్వరలయ వేదిక ముఖ్య నిర్వాహకులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో డీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ప్రభుత్వ అధికారి డి.రమణయ్య, పి.సురేష్, నటులు మల్లేశ్వరరావు, హేమాచారి పాల్గొన్నారు.

రైల్వే పరికరాల చోరీ ?

తెనాలి రూరల్: రైలు పట్టాల మరమ్మతులు కోసం వినియోగించే లక్షలాది రూపాయల విలువైన పరికరాల్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్టు తెలిసింది. తెనాలి రైల్వే స్టేషన్ పరిధిలో గత కొద్ది రోజులుగా పట్టాల మరమ్మతులు జరుగుతున్నాయి. ఇటీవల ఐదు రోజుల పాటు మారీసుపేటలోని రేపల్లె గేటును మూసివేసి మరమ్మతులు చేశారు. పట్టాల కింద ఉండే కంకర రాళ్లను జల్లెడ పట్టి 30 సెంటీమీటర్ల లోతు వరకు మట్టి, రాళ్ల పొడిని వేరు చేసే యంత్ర పరికరాల్ని రాత్రిపూట ఇక్కడి మొండి గోడల వద్ద ఉంచుతున్నారు. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి దాటాక దుండగులు వీటిని అపహరించుకెళ్లినట్టు విశ్వసనీయంగా విషయం తెలుసుకున్న విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయ అధికారులు సైతం రంగంలోకి దిగి ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్టు సమాచారం. దీనిపై తెనాలి ఆర్‌పీఎఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, సహకారం అందించాలని త్రీ టౌన్ పోలీసులనూ వారు కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

ప్రశాంత కౌంటింగే లక్ష్యంగా తనిఖీలు

- టిడ్కో ఇళ్లలో కార్డన్ సెర్చ్
- ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై ప్రత్యేక నిఘా

మంగళగిరి: జూన్ 4వ తేదీ నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని పట్టణ, రూరల్ సీఐలు శ్రీనివాసరావు, వెంకటరావు కోరారు. పట్టణంలోని టిడ్కో నివాసాలలో పోలీసులు కార్డన్ సెర్చ్ బుధవారం నిర్వహించారు. 40 మంది పోలీస్ సిబ్బంది టిడ్కో నివాసాలను జల్లెడ పట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇంటింటిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. సీఐలు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇతర ప్రాంతాల వారు ఎవరున్నా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎలాంటి అల్లర్లుకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజు ఉత్సవాలు, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదని చెప్పారు. తనిఖీలలో పట్టణ ఎస్‌ఐ కరిముల్లా, రూరల్ ఎస్‌ఐలు క్రాంతి కిరణ్, కిషోర్, దుగ్గిరాల ఎస్‌ఐ మహేంద్ర పాల్గొన్నారు.



వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న పట్టణ, రూరల్ సీఐలు శ్రీనివాసరావు, వెంకట్రావు

పరిసరాల శుభ్రతగా ఉండేలా చర్యలు

డెప్యూటీ కలెక్టర్ స్వాతి

ఫిరంగిపురం: ప్రతి గ్రామంలో వీధులు శుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డెప్యూటీ కలెక్టర్ స్వాతి ఆదేశించారు. మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల్లో వీధులు, డంపింగ్ ప్రదేశాలను డెప్యూటీ కలెక్టర్ స్వాతి, ట్రైనీ కలెక్టర్ పవన్ స్వహైల్ జగన్నాథ్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల శుభ్రత విషయంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్కడ పడితే అక్కడ ప్రజలు చెత్తను వేసేలా కాకుండా ఒకచోట డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడనే వేసేలా వారికి అవగాహన కల్పించాలని కోరారు. దుకాణాదారులు తమ దుకాణాలవద్దనే చెత్తను వేస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముందుగా వారికి నోటీసులు అందజేయాలన్నారు. అప్పటికి వినని పక్షంలో జరిమానా విధించాలని హెచ్చరించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ నిర్మలాలక్ష్మీకుమారి, పంచాయతీ కార్యదర్శులు ఏకే బాబు, బి.మధు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో ఎస్‌ఆర్‌ఎం భాగస్వామ్యం

మంగళగిరి: సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా అభివృద్ధిలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ భాగస్వామ్యం ఉంటోందని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. నగర పరిధిలోని నిడమర్రులో ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ సెంటర్‌ను స్టూడెంట్స్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ తాము ఎంచుకున్న గ్రామాలలో ఉచిత విద్య, మహిళాభివృద్ధి, రోడ్డు భద్రత, మహిళా వికాసం కోసం ప్రత్యేక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా విద్యనందించే లక్ష్యంతో తొలిసారి గ్రామీణ ట్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి సురేష్ కన్నన్, పీఆర్‌ఓ వేణుగోపాల్ గంగిశెట్టి, పుతియ తలై మురై ఫౌండేషన్ సీనియర్ కన్సల్టెంట్ ఎలమరన్, ట్యూషన్ సెంటర్ ఉపాధ్యాయురాలు ప్రత్తిపాటి సుష్మ, వర్సిటీ చీఫ్ లయజన్ ఆఫీసర్ పూళ్ల రమేష్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ

నగరంపాలెం: స్థానిక నాజ్ కూడలిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమత్ జయంత్యుత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఉదయం 10 గంటలకు స్వామికి లక్ష తులసి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఆలయ అర్చకులు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది. కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, చైర్మన్ నూరినేడి దుర్గవరప్రసాద్, శ్రీహనుమాన్ దీక్షా సమాజం సభ్యులు, ఆలయ ముఖ్య అర్చకుడు పాల్గొన్నారు.



తులసి పూజలో భక్తులు